గోంసంరక్షణ ట్రస్ట్‌కు రూ. 5 లక్షలు విరాళం

కాణిపాకం, నవంబర్ 17 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు భక్తులు ఆదివారం ఐదు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు ఐరాల మండలం చినకాంపల్లె గ్రామానికి చెందిన దివంగత బాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి మనుమళ్ళు చైతన్యరెడ్డి, రోహిత్‌రెడ్డిలు ఈపథకానికి 5,01,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, దాత

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

భక్తజన సంద్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం

బోయకొండ(చౌడేపల్లి), నవంబర్ 17 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో నిండింది. ఆదివారం కొండ దినం కావడం తో రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల వారు తరలిరావడంతో యాత్రీకుల రద్దీ అధికమైంది. ఉదయాన్నే వేదపం డితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం అలంకరణ గావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆలయ అర్చక, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

'ఆరణి' ఏదీ నీ హామీ అమలు!

-స్థానికులకు దర్శనం కోటా 'మంగళ(ం)'!

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

హిందు భక్తులకు ఏదేని కష్టమొస్తే వెంటనే ఆపదమొక్కులవాడు...వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి ముడుపుకట్టి మొక్కుకుంటే అంతా మంచి జరుగుతుందని ప్రగాఢవిశ్వాసం .అంతటి శక్తివంతమైన శ్రీవేంకటేశ్వరస్వామి తిరుమలకొండపై కొలువైన తరువాత తిరుపతివాసులు కూడా ప్రియభక్తులుగా మారిపోయారు. అనాదికాలం నుండి ఇప్పటికీ స్వామివారి పట్ల భక్తివిశ్వాసాలు కలిగిఉన్నారు. తిరుపతిలో నివాసముంటున్న స్థానికులకు ప్రతినెలలో మొదటి మంగళ వారం 5వేలమంది భక్తులకు దశాబ్దకాలం క్రిందట టిటిడి ధర్మకర్తలమండలి ఆ దేవదేవుడి దర్శన భాగ్యం కల్పించింది. ఎవరి ఎటువంటి సిఫార్సులేఖలు లేకుండా అప్పటి నుండి ఏకధాటిగా రెండేళ్ళు ఈ విధానం అమలైంది. ఇంట్లో ఎటు వంటి శుభకార్యాలు జరిగినా సంతృప్తికరంగా మంగళవారం రోజు దర్శనం చేసుకుని వచ్చేవారు.ఇందుకు మహతి ఆడిటోరియంలో ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీచేసేవారు. దీనికి గత ప్రభుత్వాలు, ధర్మకర్తలమండళ్ళు గ్రహణం పాడేశారు. తిరుపతిలోని స్థానికులకు ప్రతినెలా మంగళవారం స్థానికత ఆధారంగా కల్పించే దర్శనాలను తిరిగి పునరుద్ధరించలేదు. ఈ విషయంపై గతంలో పలువురు శ్రీవారి భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా డిమాండ్ చేసినా పట్టించుకునేవారే లేకపోయారు. 2023లో స్థానికుడైన ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి టిటిడి బోర్డులో ఛైర్మన్ అయినా ఈ విదానం పునరుద్ధరించలేకపోయారు. 2024లో జరిగిన ఎన్నికల్లో భాగంగా తిరుపతి వాసులకు జనసేనపార్టీ తరపున పోటీచేసిన ఆరణి శ్రీనివాసులు స్థానికులకు మంగళవారం శ్రీవారి దర్శన భాగ్యం కల్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఇప్పటివరకు ఆయన పట్టించుకోలేదు. పైగా సోమవారం నూతన ధర్మకర్తలమండలి తొలి సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో అయినా స్థానిక ఎమ్మెల్యే స్థానికుల తరపున ఇచ్చిన హామీని నెరవేర్చుకునే దిశగా పావులు కదుపుతారా అని చూస్తున్నారు. అంతేగాక దేశం నలుమూలల నుండి భక్తులు లక్షలాదిమంది రోజువారీగా తిరుమలకు చేరుకుని ఎన్నో వ్యయప్రయాసలకోర్చి గోవిందుని దర్శనం చేసుకుంటున్నారు. మరీ తిరుపతి వాసులకు కల్పించిన మంగళవారం స్వామివారి దర్శనం మాత్రం పునరుద్ధరించలేకపోయారు. దేశంలోని అనేక హిందూ దేవాలయాల్లో కొన్ని రోజుల్లో స్థానికులకు ఆయా దేవుళ్ల దర్శనం కల్పిస్తున్న విషయం విదితమే. అక్కడి స్థానికులు ఆలయ దర్శనాలతో ప్రాధాన్యత ఉంది. మరీ తిరుమలేశుని దర్శనంపై తిరుపతి వాసులకు మంగళవారం దర్శనం కల్పించే విషయంపై నేడు బోర్డులో చర్చించి అనుగుణంగా శుభవార్త చెబుతారనేది తిరుపతివాసులు ఆశతో ఉన్నారు. ఈ విషయంపై బిజెపి నేత, శ్రీవారి భక్తుడు నవీన్‌కుమార్‌రెడ్డి కూడా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు చూడాలని సూచించారు.

ప్రభుత్వ లాంఛనాలతో రామ్మూర్తినాయుడి అంత్యక్రియలు

తమ్ముడి పాడెమోసిన ముఖ్యమంత్రి చంద్రబాబు - తండ్రికి నారా రోహిత్ దహన సంస్కారాలు
మహారాష్ట్ర గవర్నర్‌తో సహా ప్రముఖుల నివాళి - తల్లిదండ్రుల సమాధుల ప్రక్కనే దహన సంస్కారాలు

చంద్రగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త:

అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన మాజీ ఎంఎల్ఏ నారా రామ్మూర్తి నాయుడు పార్థివ దేహాన్ని ఆదివారం ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి తీసుకువచ్చారు. ఎంఎల్ఏ పులివర్తి నాని అంబులెన్స్ ద్వారా నారావారిపల్లికి తీసుకువచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా భువనేశ్వరీ, నారా లోకేష్, నారా బ్రాహ్మిణి, నారా దేవాన్స్ ఆయన పార్థివదేహంపై పుష్పగుచ్చం వుంచి నివాళులర్పించారు. ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తన రాజకీయ గురువు రామ్మూర్తి నాయుడు మృతి పట్ల తీవ్ర ఆర్ద్రతకు లోనైన ఎంఎల్ఏ పులివర్తి నాని ఆద్యంతం దహన సంస్కారాలు పూర్తయ్యేంత వరకు అన్నీతానై సేవలం దించారు. గుండె సంబంధిత అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన రామ్మూర్తి నాయుడు గుండెపోటుకు గురై అశువులుబాశారు. తండ్రి పార్థివ దేహం వద్ద విలపిస్తున్న నారా గిరీష్, నారా రోహిత్‌లను చంద్రబాబు ఓదార్చారు. రామ్మూర్తి నాయుడు పార్థివ దేహాన్ని తన తల్లిదండ్రులు అమ్మ ణమ్మ, ఖర్జూర నాయుడు సమాధుల ప్రక్కన దహన సంస్కారాలు నిర్వహించారు. నారావారిపల్లిలో మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణ, ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎంఎల్ఏలు డాక్టర్ కలికిరి మురళీమోహన్, గురజాల జగన్‌మోహన్, అమర్‌నాథ్ రెడ్డి, భానుప్రకాష్, శాప్ చైర్మన్ రవినాయుడు, మంచు మోహన్‌బాబు, మంచు విష్ణు, రాజేంద్రప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు,ఎమ్మార్పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, మాజీ ఎంఎల్ఏలు చదలవాడ కృష్ణమూర్తి, ఎస్సీవి నాయుడు, శంకర్ యాదవ్, ఎంఎల్ఏ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి, తనయుడు పులివర్తి వినీల్, తుడా మాజీ చైర్మన్ నరశింహ యాదవ్, టిడిపి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి సింగు సుధ, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, డాలర్స్ దివాకర్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో చంద్రబాబు, లోకేష్, పులివర్తి నాని బాధాతప్త హృదయంతో పాడెనుమోశారు. అంతిమయాత్రలో మందకృష్ణ మాదిగ డప్పువాయించి తన ఆవేదనను పంచుకున్నారు. రామ్మూర్తి నాయుడు తనయుడు నారా రోహిత్ తండ్రి చితికి నిప్పుపెట్టి దహన సంస్కారాలు నిర్వహించారు.

చెట్టును ఢీకొన్న మినీ వ్యాన్

ఇద్దరు మృతి

వాహనంలో ఇరుకుపోయి మృతి చెందిన మృతదేహాలు

సత్యవేడు, నవంబరు 17 ప్రభాతవార్త: సత్యవేడు మండలం శ్రీసిటీ పరిధి లోని త్రిబుల్ ఐటీ సర్కిల్ సమీపంలో కేటరింగ్ మినీ వాహనం చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ అజయ్ రామ్(42), మనోజ్‌సింగ్(52) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ రోడ్డు ప్రమాదం ఆదివారం మధ్యాహ్నం దాదాపు రెండు గంటల సమయంలో సంభవించింది. వివరాలు ఇలా... కార్ కేటరింగ్ సేవలో భాగంగా తడ నుంచి మినీ వాహనం ద్వారా బిస్కెట్లు, టీ తీసుకొచ్చి శ్రీసిటీ కోబల్కో కంపెనీకి సరఫరా చేసింది. అనంతరం మినీ వాహనం తిరుగు ప్రయాణంలో త్రిబుల్ ఐటీ సర్కిల్ వద్ద మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో వాహనం ముందు భాగం నుజ్జు నుజ్జు అయి డ్రైవర్ అజయ్‌రాం, మనోజ్ సింగ్‌లు ఆ వాహనంలో ఇరుకుపోయి అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవరు వాహనాన్ని అతి వేగంగా నడపడం వల్లే అదుపు తప్పడంతో చెట్టును ఢీకొట్టడం జరిగిందని శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. తడలో నడుస్తున్న కార్ కేటరింగ్ సేవల్లో మృతి చెందిన ఇద్దరు పని చేస్తున్నారన్నారు. వీరిద్దరు బీహార్ రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ హరిప్రసాద్ పేర్కొన్నారు.

స్టోర్స్ రికార్డుల పరిశీలన

నలుగురు సెక్యూరిటి సిబ్బంది ఇంటికి హోంగార్డును సరెండర్



శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయ పాలనలో పారదర్శకతకు ఇఓ టి బాపిరెడ్డి పెద్దపీట వేస్తున్నారు.ఆదివారం ఆయన పలు శాఖల పని తీరును నిర్వహణకు సంబం ధించి ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఉదయం నుంచి ఓ వైపు ఆలయంలో దర్శనాలను పరిశీలించు కుంటూ మరో వైపు వివిధ శాఖల పని తీరును ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆయన పరిశీలనలతో నలుగురు సెక్యూరిటి సిబ్బంది ఇంటి దారి పట్టారు.మరో హోంగార్డు సరెండర్ అయ్యారు. ఒక అటెండర్‌ను సస్పెండ్ చేసారు. ఆలయ ఇఓ బాపిరెడ్డి నిత్య అన్న ప్రసాదం పడితర స్టోర్స్‌ను పరిశీలించారు. ఇక్కడ లెక్కలను స్టోర్స్ గుమాస్తా షణ్ముగం వివరించారు. రికార్డులు, స్టోర్స్‌లో ఉన్న స్టాకులను పరిశీలించారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని వస్తువుల సేకరణలో నాణ్యతను పాటించాలని, టెండర్లో పొందుపరచిన సరకులనే తీసుకోవాలని ఆదేశించారు. తరువాత వంటల తయారి కేంద్రంలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. వేలాది మంది భోజనం చేసే పవిత్ర స్థలం కాబట్టి ఇక్కడ పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యత కల్పించాలని ఇఓ సూచించారు.

సెక్యూరిటి సిబ్బంది ఇంటికి:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 15 నుంచి సిబ్బంది ఆలయంలో పని చేసే ప్రతి ఒక్కరు స్థుపద మండపం దాటి సెల్‌ఫోన్లు,ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి లేదని సెల్‌ఫోన్లు భద్రపరచుకొనుటకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసారు. ఆదివారం ఇఓ ఆకస్మిక తనిఖీల్లో హోంగార్డు,సెక్యూరిటి సిబ్బంది,అటెండర్ ఫోన్లో మాట్లాడుకుంటుండగా గమనించి హోంగార్డును సరెండర్ చేయమని ఆదేశించారు. నలుగురు సెక్యూరిటిని ఇంటిదారి పట్టించారు. కాంటాక్టు బేసిక్‌లో పని చేస్తున్న అటెండర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారి చేసారు.

పిల్లల అక్రమ రవాణాపై

రైల్వేపోలీసులు కొరడా...

8 మంది పిల్లలను రక్షించిన రైల్వే పోలీసులు
ముగ్గురు రవాణా దారులు అదుపులో

రేణిగుంట, నవంబరు 17 ప్రభాతవార్త: తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఆదివారం 8 మంది పిల్లలను రక్షించి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మధ్య కాలంలో మైనర్ పిల్లల అక్రమ రవాణాపై బచ్చన్ బచావో ఆందోళన్ భాగంగా రైల్వే శాఖ ఉక్కుపాదం మోపింది. ఈ నేపథ్యంలో తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ మధుసూదన్ నేతృత్వంలో బచ్చన్ బచావ్ ఆందోళన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ తిరుపతి రావు, ఏపీవో కన్నెపల్లి శ్రీకాంత్ రైల్వే పోలీసుల సహాయంతో అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టారు. హజరత్ నిజాముద్దీన్ త్రివేంద్రం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్‌లో గూడూరు నుంచి తిరుపతి మధ్యతనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 8 మంది మైనర్ బాలల అక్రమ రవాణాకు గురవుతున్నట్టు గుర్తించారు. వీరిలో ఒక బాలిక ఉండడం గమనార్హం. అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురు మైనర్ బాలురను ప్రభుత్వ బాలుర గృహానికి, బాలికను ప్రభుత్వ బాలికల గృహానికి అప్పగించారు. అదుపులోకి తీసుకున్న మానవ అక్రమ రవాణా దారులను జీఆర్‌పీ పోలీసుల ద్వారా భారత న్యాయ సంస్థాన్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మైనర్ పిల్లలను కొంత మంది ఏజెంట్లు పిల్లల తల్లిదండ్రులను బలవంతంగా ఒప్పించి నాగపూర్ నుంచి చిత్తూరు జిల్లాలో పలు పరిశ్రమల్లో పని చేయించడానికి తరలిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని రైల్వే సీఐ మధుసూదన్ తెలిపారు. మానవ అక్రమ రవాణా ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులను సిబ్బందిని రైల్వే ఉన్నతాధికారులు అభినందించారు.

నరకప్రాయంగా కోట-నాయుడుపేట రోడ్డు

కోట, నవంబర్ 17 ప్రభాతవార్త కోట-నాయుడుపేట మార్గంలో ప్రయాణమంటే వాహనచోదకులు, ప్రయాణికులు వణికిపోతున్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు అత్యంత ప్రమాదకరంగా మారింది. భారీ గుంటలు, రాళ్లతో ఒళ్లు హూనమవుతుంది. అడుగడుగునా చిన్నపాటి చెరువుల్లాంటి అగాధాలు ఏర్పడి ప్రయాణం ప్రాణసంకలంగా మారింది. ఏమాత్రం ఏమరుపాటు వహించినా ప్రాణాపాయం తప్పని పరిస్థితి. కోట నుంచి గునపాడు వరకు అడుగడుగునా వందలాది గుంటలు ఉండటంతో వాహనచోదకులు నిత్యం నరకం చవిచూస్తున్నారు. ప్రతి గుంటా మోకాలికి పైగా లోతు ఏర్పడి అత్యంత ప్రమాదకరంగా ఉంది. దీనికితోడు భారీ వాహనాల్లో ఇసుక తరలిస్తుండటంతో దుమ్ములేచి కమ్మేస్తుండటంతో వెనుక నుంచి వచ్చే వాహనాలకు ఏమీ కనిపించని పరిస్థితి. దీనివలన ప్రమాదాలు జరగడమే కాకుండా ఆ మార్గంలో నివాసం ఉండే ఇళ్లలో భారీగా దుమ్ము చేరుతోంది. ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరిన్ని మంచి కార్యక్రమాలకు సేవలు

-టిటిడి ఎక్స్‌అఫిషియో సభ్యుడు శ్యామలరావు

తిరుమల,నవంబర్ 17ప్రభాతవార్త ప్రతినిధి

శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో సేవకుడుగా సేవలందించే భాగ్యం ఆనందంగా ఉందని, ఇప్పుడు ఎక్స్‌అఫిషియోసభ్యుడుగా సేవలందించే అవకాశంతో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతామని టిటిడి ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో తనకు అదృష్టమ న్నారు. టిటిడి దర్మకర్తలమండలి ఎక్స్‌అఫిషియో సభ్యుడుగా ఆదివారం ఉదయం ఈఓశ్యామలరావు చేత అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ప్రమాణస్వీకారం చేయించారు.

మత్తు వదలరా ..!!

సిఎం చంద్రబాబు ఇలాఖాలో 'ఆపరేషన్ గంజాయి'
- 'గంజాయి రహిత కుప్పం' కోసం 28 రోజుల యాక్షన్ ప్లాన్..
-నియోజకవర్గ..మండలస్థాయిల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటు !!
- నేటినుంచి బరిలో దిగుతున్న అధికార యంత్రాంగం !!

కుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సొంత నియోజకవర్గం కుప్పంలో ఇటీవలి కాలంలో విచ్చలవిడిగా దొరుకుతున్న మత్తు పదార్థమైన 'గంజాయి'ని సమూలంగా నిర్మూలించేందుకు అధికార యం త్రాంగం సన్నద్ధమయ్యారు. ఇటీవల 'వార్త'లో 'కుప్పాన్ని కలవర పెడుతున్న గంజాయి' అనే కథనం వెలువడిన విషయం విదితమే. దీనిపై ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించారు. కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ నేతృత్వంలో గంజాయి నిర్మూలనకు సంబంధించి 28 రోజుల యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు. గంజాయిని పూర్తిగా నిషేధించేందుకు నియోజకవర్గ స్థాయిలో ఓ కమిటీ, మండల స్థాయిలో ఓ టాస్క్‌ఫోర్స్ కమిటీని ప్రభుత్వ శాఖల అధికారులతో నియమించారు.

కడ పి.డి. నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు : గంజాయి నిర్మూలనకు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ నేతృత్వంలో మరో తొమ్మిది మంది అధికారులతో నియోజకవర్గస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీలో కుప్పం ఆర్డీఒ, డిఎస్పీ, వ్యవసాయ శాఖ జెడి, ఎడి, పట్టుశాఖ జెడి, ఎడి, ఉద్యానవన శాఖ జెడి,ఎడి, ఎక్సైజ్ సూపరింటిండెంట్, ఎక్సైజ్ సిఐ, డిప్యూటీ డిఎంహెచ్ఒ, ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్, జిల్లా అటవీ అధికారి, ఎస్డీఎఫ్ఒ, పశుసంవర్థక శాఖ జెడి,ఎడిలు ఉంటారు. అలాగే మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీల్లో తహశీల్దార్, సిఐలు, ఎస్సైలు, ఎంపిడిఒలు, ఎఒలు, సిరికల్చర్, హార్టికల్చర్, ఎక్సైజ్ సిఐ, ఎస్సైలు, ఎంఇఒ, కుప్పం మున్సిపల్ కమీషనర్, వైద్యాధికారులు, ఎఫ్ఆర్వో, పశువైద్యులు కమిటీలో ఉంటారు.

నేటి నుంచి నుంచి రంగంలోకి : కుప్పం నియోజకవర్గంలో గంజాయి నిర్మూలనకు సంబంధించి టాస్క్‌ఫోర్స్ కమిటీలు నేటినుంచి రంగంలో దిగుతాయి. ఈనెల 18-25 తేదీల మధ్య గంజాయి సాగు హాట్‌స్పాట్లను గుర్తించడం, వ్యవసాయ పొలాలు పరిశీలించడం చేపడతారు. 26వతేది నుంచి డిసెంబర్ 3వతేది వరకు గుర్తించిన గంజాయి హాట్‌స్పాట్లను, పొలాల్లో సాగులో ఉన్న గంజాయిని ధ్వంసం చేస్తారు. డిసెంబర్ 4-15 తేదీల్లో గుర్తించిన ప్రాంతాల్లో వివిధ రకాల మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటారు. వీటితో పాటు మండల స్థాయి కమిటీలు ఈనెల 18నుంచి డిసెంబర్ 9 దాకా గ్రామాల్లో రెండు విడతలుగా గ్రామసభలు నిర్వహించి గంజాయితో కలిగే అనర్థాలు వివరించి గంజాయి సాగు చేస్తే తీసుకునే చర్యల గురించి ప్రజలకు వివరించనున్నారు. అదేవిధంగా విద్యార్థులకు సైతం గంజాయితో కలిగే అనర్థాలను వివరిస్తూ వారిని చైతన్య పరచేలా కార్యక్రమాలు నిర్వహిస్తారు. గంజాయితో కలిగే నష్టాలు వివరిస్తూ కరపత్రాలు, పోస్టర్లను ఏర్పాటుచేయనున్నారు.

సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీ శుభవార్త

- 25 శాతం రాయితీతో ప్రయాణించడానికి మళ్ళీ అవకాశం

చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త:

ఎపి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సీనియర్ సిటిజన్లకు శుభవార్త చెప్పింది. ఇది వరకు సీనియర్ సిటిజన్లకు ఎపి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కల్పిస్తున్న 25 శాతం రాయితీని పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఒకటిరెండు రోజుల్లో ఉత్తర్వులు వెలవడనున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. ఎపి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సీనియర్ సిటిజన్లకు ఇది వరకు 25 శాతం రాయితీలో ప్రయాణించే అవకాశం కల్పించింది. ఈ మేరకు రాష్ట్రంలో అత్యధికంగా సీనియర్ సిటిజన్లు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణాలు సాగించేవారు. అయితే కరోనా సమయంలో ఆర్టీసీ సీనియర్ సిటిజన్లకు కల్పిస్తున్న 25 శాతం రాయితీని రద్దు చేసింది. అప్పటి నుండి ఇప్పటి వరకు సీనియర్ సిటిజన్లు ఆర్టీసీలో పూర్తి స్థాయి టిక్కెట్టు కొనుగోలు చేసి ప్రయాణం చేయవచ్చు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం మళ్ళీ ఆర్టీసీ సీనియర్ సిటిజన్లకు 25 శాతం రాయితీతో ప్రయాణ అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ఇది వరకు కేవలం రాష్ట్రం లోపల తిరిగే ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో మాత్రమే సీనియర్ సిటిజన్లకు ఈ రాయితీ అవకాశం వుండేది. అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసుల్లో ఈ రాయితీ వుండేది కాదు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రంలో తిరిగే ఆర్టీసీ బస్సు సర్వీసులతో పాటు అంతర్‌రాష్ట్ర ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో సైతం సీనియర్ సిటిజన్లకు బస్సు ప్రయాణ ఛార్జీల్లో 25 శాతం రాయితీ కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.

98 ఏళ్ల వయసులో తెదేపా సభ్యత్వం పొందిన వృద్ధురాలు

కుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త 98 ఏళ్ల వయసులో ఓ వృద్ధురాలు తెలుగుదేశం పార్టీపై ఉన్న అభిమానంతో సభ్యత్వం పొందింది. చెక్కునత్తం పంచాయతీ కూసూరుకు చెందిన కన్నమ్మ అనే వృద్ధురాలికి 98 ఏళ్లు వయసు. ఈమె ఆదివారం తన సొంత డబ్బులు వంద రూపాయలు చెల్లించి తెదేపా సభ్యత్వ ం పొందింది. సిఎం చంద్రబాబునాయుడు అంటే తనకు ఎంతో అభిమానం అని ఆమె పేర్కొంది. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి, ఐటిడిపి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

వి.కోట, నవంబర్ 17 ప్రభాతవార్త

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కవి సమ్మేళన ంను నిర్వహించారు. కళాభారతి ఫౌండేషన్ అధ్యక్షులు డా॥ రఘుపతి నేతృత్వంలో స్థానిక గ్రంథాలయంలో జరిగిన కవి సమ్మేళనానికి జిల్లా నలుమూలల నుంచి కవులు విచ్చేసి తమ కవితలతో అలరించారు. కార్ య్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రంగనాథ్, డా॥ కె.వెంకటరత్నం, డా॥ శాంతకుమారి, శివరాం, హరికృష్ణరెడ్డి, చిత్తూరు గురజాడ ఫౌండేషన్ రవీంద్రబాబు, సిద్ధారెడ్డి, విద్యార్థులు, సిబ్బంది మహ్మద్ వహాబ్ పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చును. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరు హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

బంగారుపాళ్యం, నవంబర్ 17 ప్రభాతవార్త:

చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి నలగాంపల్లి వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. నలగాంపల్లి దళితవాడకు చెందిన ఆబేలు(77) రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుండి పలమనేరు వైపుకు వెళ్తున్న టెంపో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆబేలును చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా అతను మృతి చెందాడు. ఈ మేరకు ఎఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్

చిత్తూరు, నవంబర్ 17 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చును.

సమస్యలు ప్రస్తావించేవారు లేరా!

బంగారుపాళ్యం, నవంబర్ 17 ప్రభాతవార్త:

బంగారుపాళ్యం మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలు ప్రస్తావించే ప్రజాప్రతినిధులు కరువయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశభవనంలో ఆదివారం ఎంపిపి అమరావతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపిపి అమరావతమ్మతో పాటు జడ్పీటిసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డిలతో పాటు ఎంపిటిసీలు, సర్పంచ్‌లు హాజరైనప్పటికీ ఏ ఒక్కరు సైతం మండల పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళలేదు. తూతూ మంత్రంగా నిర్వహించి ముగించారు. సమావేశం మొత్తం అధికారులు నివేదికలు చదివి వినిపించి పూర్తి చేశారు

తూతూ మంత్రంగా మండల మీట్

శ్రీరంగరాజపురం, నవంబర్ 17 ప్రభాతవార్త:

ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై మండల సమస్యలను అధికారుల సమక్షంలో చర్చించి పరిష్కరించుకోవడానికి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం గత ఆరు నెలలుగా ప్రాధాన్యత కొల్పోయింది. మండల పరిషత్ అధ్యక్షురాలు సరిత అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం జరుగాల్సివుండగా ఆమె సమావేశానికి గైర్హాజర యా్యరు.

అలాగే సమావేశానికి జడ్పీటిసీ రమణ ప్రసాద్‌రెడ్డి వైస్ ఎంపిపిలు గీత, కె.లక్ష్మీలు సైతం సమావేశానికి గైర్హాజరు కావడంతో ఎంపిడిఓ మోహన్‌మురళీ నిబంధనల మేరకు ముదిగుప్పం ఎంపిటిసీ సిద్ధయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించి పూర్తి చేశారు. ఎంపిపి సరిత, జడ్పీటిసీ రమణప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు గీత, కె.లక్ష్మీలు అనారోగ్యం కారణంగా సమావేశానికి గైర్హాజరు అవుతున్నామని ఆలస్యంగా సమాచారం అందించారు. మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి అవసరమైన కోరం సభ్యులు సమావేశానికి హాజరు కావడం, సభా అధ్యక్షులు ఎంపిపి అలాగే వైస్ ఎంపిపిలు ఇద్దరు గైర్హాజరు కావడంతో ఎంపిడిఓ మోహన్‌మురళీ 1994 పంచాయతీరాజ్ చట్టంను అనుసరించి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించి పూర్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపిటిసీలు, సర్పంచ్‌లు ఎవ్వరు తమ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించలేదు. సమావేశానికి హాజరైన అధికారులు మాత్రం మండలంలో జరుగుతున్న అభివృద్ధి నివేదికలు చదివి వినిపించడంతో సమావేశం ముగిసింది.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయ అధికారిణి సత్యవాణి నేతృత్వంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చదవడం నాకిష్టం కార్యక్రమం నిర్వహించిన అనంతరం సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పిల్లలకు అంకెలు వెతకడం, తిరకాసు పదాలు, కథ చదివి రాయడం వంటి పోటీలు నిర్వహించారు. ఈనెల20వతేది వరకు గ్రంథాలయ వారోత్సవాలు జరగనున్నాయి.

హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయండి

వెదురుకుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త : హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఖండ హైందవ శంఖారావం కమిటీ పిలుపునిచ్చారు. మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలోగల మొరవ ద్రౌపది సమేత ధర్మరాజుల మహాభారతం మిట్ట వద్ద ఆదివారం సన్నహక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగ్ సంఘచాలక్ వారు మాట్లాడుతూ విదేశీ దురాక్రమణ నుంచి స్వాతంత్ర్యం వచ్చినా మన దేవాలయాల కానుకలు, ముడుపులు ప్రభుత్వ అధికారుల దుర్వినియోగం అవుతున్నాయని, కొన్ని రాజకీయ పార్టీలు లౌకికతత్వం ముసుగులో హిందూ సంప్రదాయాల నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. దేవాలయాలలో దేవాదాయ ధర్మాదాయ సంస్థల్లో అన్యమత ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేశారు. దేవాలయ ట్రస్టు బోర్డుల్లో రాజకీయ పార్టీలకు ప్రమేయం లేకుండా హిందు భక్తులు మాత్రమే ఉండాలన్నారు. 2025 జనవరి 5న జరిగే హైందవ శాంఖారావం బహిరంగ సభకు వేలమంది తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఏకగ్రీవంగా కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఖండ కన్వీనర్‌గా రోశయ్య, సహకన్వీనర్‌గా రోహిత్‌రాజు, నిధి ప్రాముఖ్ హనుమంత్, సహప్రాముఖ్ అశోక్, రవాణా ప్రముఖ్ మనోహర్ , సహ ప్రముఖ్ రామకృష్ణ, మిడియా ప్రముఖ్‌గా పాముల శేషాద్రి, సోషియల్ మిడియా ప్రముఖ్‌గా హేమశేఖర్, విరతణ సభ్యులుగా విశ్వనాథ్ రెడ్డి, చిన్నస్వామి రెడ్డిచ ప్రకాష్, రాజశేఖర్, గోవిందయ్య, సుమన్, ప్రభాకర్ శెట్టి, జ్యోతి రెడ్డిలను ఎంపిక చేశారు.

రామ్మూర్తి నాయుడుకు నివాళులర్పించిన చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, నవంబర్ 17, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ శాసనస భ్యులు నారా రామ్మూర్తి నాయుడు పార్తివదేహానికి వారి స్వగ్రామంనారావారిపల్లెనందుపుంగనూరు నియోజకవర్గఇన్చార్జిచల్లా రామచంద్రారెడ్డి నివాళులర్పించారు.

వైభవంగా మహాభారతం

కల్లూరు, నవంబర్ 17, ప్రభాతవార్త

పుల్లిచర్ల మండలంలోని కొమ్మిరెడ్డివారిపల్లెలో 11 రోజులు పాటు గాన కోవిల నీతే మహాలక్ష్మి పగులు కథ వివరించారు. గ్రామస్థులు, కావేటిగారిపల్లె పోశంవారిపల్లె, పల్లింకివారిపల్లె, వల్లివేడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త వల్లివేడు రాజరెడ్డి అధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఉభయదారులుగా చక్రవర్తి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, రాఘవరెడ్డి, జయచంద్రారెడ్డి, కేశవ రెడ్డి, ఏకాంతరెడ్డి, రెడ్డప్ప రెడ్డి, ఇంద్రసేన రెడ్డి, జనార్ధన రెడ్డి, అనిత మునికృష్ణ, సుబ్బరాజు, రామమూర్తి రెడ్డి, రుకేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

రామూర్తి నాయుడు మృతి తీరని లోటు

కుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామూర్తి నాయుడు మృతి తీరని లోటు అని సిఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద దివంగత రామూర్తినాయుడు చిత్రపటానికి పూజలు చేసి తెదేపా నేతలు ఘన నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామూర్తి నాయుడు దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నేతలు ఆర్ఆర్ రవి, మంజు, ఉపేం ద్రకుమార్, బోండాల నాగరాజు, జయరాం నాయుడు, అప్పి, రవి, వేలు, బాలాజీ, వేణు,నారాయణ,నబీఉల్లా,శారదమ్మ, రాధ, జనసేన నరేష్, పాండు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రామూర్తి నాయుడుకు నివాళులు అర్పించిన ఆర్టీసీ వైస్ ఛైర్మన్, పిఎస్ఎం .. నేతలు

కుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త

చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సిఎం చంద్రబాబు నాయుడు సోదరుడు రామూర్తి నాయుడు పార్థివ దేహానికి ఆదివారం ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ఘన నివాళులు అర్పించారు. ఆదివారం ఉదయం నారావారిపల్లికి ఆయన చేరుకుని రామూర్తి నాయుడుకు నివాళులు అర్పించి కుటుంబీకులను పరామ ర్శించారు. రామూర్తి నాయుడు మృతి నారా వారి కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్,మాజీ గంగమ్మగుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ, జిల్లా నేత సుగుణమ్మ, తెలుగుయువత రాష్ట్ర నేత పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 45మంది ఎంపిక

కుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త

సాయిమాతా సేవా ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వారిచే కుప్పంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 180మంది హాజరు కాగా వారికి కంటి పరీక్షలు నిర్వహించి 45మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి సోమవారం బెంగళూరులో ఆపరేషన్లు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు, వైద్య బృందం శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

– కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్

కుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గ స్థాయిలో సోమవారం కుప్పం మండల కార్యాలయం హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గ ంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ప్రజలనుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, నవంబర్ 17 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు పలమనేరుకు చెందిన ఎం.కృష్ణయ్య అనే భక్తుడు రూ1,00,116లను, అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు బి.మహేష్‌కుమార్ లక్ష రూపాయలను వేర్వేరుగా విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాతలు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలనుఅందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాతల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీఅగస్తీశ్వరాలయ వార్షికోత్సవం

పుంగనూరు, నవంబరు 17 ప్రభాతవార్త :

మండలంలోని నెక్కొంది వద్ద వెలసిన శ్రీఅగస్త్యేశ్వరాలయ మహద్వార గోపుర వార్షికోత్సవాలలో రెండవ రోజు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.చోళ రాజులు నిర్మించిన ఈఆలయ గోపురం ప్రాకారాలు శిథిలం కావడంతో, ఆరేళ్ళక్రితం ఆలయ మహద్వారగోపుర,ప్రాకారాల నిర్మాణం పూర్తిచేసి తన సేవను స్వామివారికి అంకితం చేసిన జనసేన నాయకుడు ఎన్వీఆర్‌ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.వేణుగోపాల్‌రెడ్డి, ఉషశ్రీదంపతులు,వారి కుటుంబ సభ్యులు ఈమహోత్సవాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా శ్రీఅగస్త్యేశ్వర స్వామివారికి వేకువజామునుంచే వేదపండితుల వేదపారాయణం, మధ్యన అర్చకులు స్వామివారికి ఏకవార రుద్రాభిషేకం,పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్రహోమం,మహామృత్యుంజయ హోమం వైభవంగా నిర్వహించి మహామంగళ హారతినిచ్చారు. సాయంత్రం పూర్ణాహుతి చేపట్టారు. కార్యక్రమాలలో ఎన్వీఆర్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం, ఇద్దరి అరెస్టు

పుంగనూరు,నవంబరు 17 ప్రభాతవార్త :

కర్నాటక మద్యాన్ని తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని ఎక్సైజ్ సిఐ వేణుగోపాల్‌రెడ్డి సిబ్బంది అదుపులోనికి తీసుకున్నారు. పక్కాగా వచ్చిన సమాచారం మేరకు పట్టణంలోని ప్రకాశం కాలనీకు చెందిన కే.శ్రీనివాసులును అరెస్టు చేసి అతని వద్దనుంచి 88 ఒరిజనల్‌ఛాయిస్ టెట్రాపాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.ఇదే విధంగా మన రాష్ట్రానికి చెందిన ఓల్డ్‌అడ్మిరల్ బ్రాండ్ 11 మద్యం బాటిళ్ళను కలిగి ఉన్న బండ్లపల్లి మంజునాథరెడ్డి అరెస్టుచేసి కేసునమోదు చేశారు.దాడులలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి,చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ జవహర్‌బాబు,హెచ్‌సి సుబ్రహ్మణ్యంగౌడ్,సిబ్బంది చక్రినాయక్,దశరథ,నరేంద్రరెడ్డి,సురేంద్రబాబులు పాల్గొన్నారు.

సంతానలేమిని అధిగమించవచ్చు

పుంగనూరు,నవంబరు 17 ప్రభాతవార్త :

సాంకేతిక పరిజ్ఞానం పరిఢవిల్లిన నేటి తరుణంలో సంతానలేమి సమస్యకాదని, మనోవేదనకు గురికాకుండా నిపుణులను సంప్రదిస్తే పండంటి సంతానాన్ని సాధించవచ్చని ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర శివ అన్నారు. ఆదివారం పట్టణంలో లయన్స్ క్లబ్,వియ్‌కేర ఐవిఎఫ్ అధ్వర్యంలో సంతానలేమి కుటుంబాలకు ఉచిత వైద్యశిబిరం జరిగింది. ప్రముఖ వైద్యులు డాక్టర్ ఖలీలుల్లా,డాక్టర్ అంజుమున్నీసాల అధ్వర్యంలో పరిసర ప్రాంతాలకు చెందిన 60కిపైగా కుటుంబాల వారికి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పెద్దనగరాలలో ఫెర్టిలిటీ కేంద్రాలలో నిర్వహించే చికిత్సా విధానాలకంటే అత్యాధునిక ఫెర్టిలిటీ టెక్నికల్‌ట్రీట్‌మెంట్ ద్వారా సంతానం కలిగేందుకు వియ్‌కేర్‌లో చికిత్సలు అందచేస్తున్నామని వివరించారు.కార్యక్రమాలలో లయన్స్‌నాయకులు ముత్యాలు,త్రిమూర్తిరెడ్డి, రజీఅహ్మద్, సివిరెడ్డిప్రసాద్,సుబ్రహ్మణ్యం,సతీష్,మహిపాల్‌రెడ్డి,వికేరసిబ్బందిఫరహానా,యశస్విని పాల్గొన్నారు.

చిత్తూరు సెంట్రల్ మండల కార్యశాల సమావేశం

చిత్తూరురూరల్, నవంబరు 17 ప్రభాతవార్త:

జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆదివారం చిత్తూరు సెంట్రల్ మండల కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధిక సంఖ్యలో సభ్యత్వాలు చేసిన వారికి క్రియాశీలక సభ్యత్వం వస్తుందని, క్రియాశీలక సభ్యత్వం వచ్చిన వారికి మండల, జిల్లా స్థాయిలో పదవులు వస్తాయనీ కాబట్టి ప్రతి ఒక్కరు ప్రతి పోలింగ్ బూత్‌లో సభ్యత్వాలు చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం, సెంట్రల్ మండల రిటర్నింగ్ అధికారి రంభ దొరబాబుగౌడ్, యువమోర్చా కార్యవర్గ సభ్యులు విశాల్‌జైన్, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్‌రెడ్డి మస్తాన్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి ఢిల్లీరాణీ, సెంట్రల్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాసంప్రోక్షణ పూజలు

వెదురుకుప్పం, నవంబర్ 17 ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని చవటగుంట మహాభారతం వద్ద సోమవారం నుండి బుధవారం వరకు మూడు రోజుల పాటు మహా సంప్రోక్షణ ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు విచ్చేసి విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణా రెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు వేద పండితులచే గణపతిపూజ, స్వస్తివాచనంచ బుత్వికరణము, అంకురార్పరణం, వాస్తుపూజచ వాస్తుహోమం,మూలవర్లకు అభిషేకం, కలశస్థాపన,అర్చన, హారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. అలాగే బుధవారం 11 గంటలకు అమ్మవారి కళాణ్యం ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తిరుపతి డివిజన్

బసవయ్యపాళెంలో లోపించిన పారిశుద్ధ్యం

తొట్టంబేడు, నవంబర్ 17 ప్రభాతవార్త

మండలంలోని బసవయ్యపాళెంలో పారిశుద్యం అధ్వాన్నంగా మారింది. మండలంలోని 27 పంచాయతీల్లో ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని గ్రామాలు, దళిత, గిరిజన వాడలు బురదమయంగా మారాయి. ఇక మండల కేంద్రానికి సమీపంలోని బసవయ్యపాళెంలో పారిశుద్యం అద్వాన్నంగా మారింది. కనీసం రోడ్డుపై ప్రజలు కూడా నడవలేని స్థితిలో బురదమయంగా రోడ్లు మారడంతో సీజనల్ వ్యాధులు ప్రజలే అవకాశం ఉంది. మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఎఎన్ఎంలు పర్యటించి మందులను పంపిణీచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక గ్రామంలో పరిస్థితి అద్వాన్నంగా మారింది. ఎక్కడ చూసినా పేడదిబ్బలు, బురద కనిపిస్తున్నాయి. ఇక రిమోట్ ఏరియాలో ఉన్న కాసరం పరిధిలో ఏమాత్రం ఎఎన్ఎంలు పనిచేస్తున్నారో వైద్యసిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారో వారికే తెలియాలి. ఇకనైనా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్యంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

తెదేపా పార్టీ కార్యాలయంలో రామూర్తినాయుడుకు నివాళులు

.శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త

పట్టణ టిడిపి కార్యాలయంలోని యోజకవర్గ శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సూచనల మేరకు పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో చంద్రగిరి మాజీ శాసనసభ్యులు నారా రామ్మూర్తి నాయుడుకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పట్టణ అధ్య క్షులువిజయకుమార్‌నాయుడు మాట్లాడుతూ రామ్మూర్తి నాయుడు శాసనసభ్యులుగా గ్రామాలకు రోడ్లు, మంచినీర్లు, బస్సు సౌకర్యం కల్పించారని, కాణిపాకం ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడపిన వారిలో రామ్మూర్తినాయుడు ఒకరన్నారు. కార్యక్రమంలోపలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత

తొట్టంబేడు, నవంబర్ 17 ప్రభాతవార్త

పట్టణంలోని ఎంజిఎం జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాలిపేటకు చెందిన మునిరాజ కుమారుడు బి.మునిశ్యాం(17) ఈనెల 15వ తేదీన సాయంత్రం 6.30గంటల సమయంలో తప్పిపోయిన బాలుడు బి.మునిశ్యాంను తీసుకువస్తానని ఇంట్లో చెప్పి మళ్ళీ మరలా తిరిగిరాలేదు. ఇంట్లో ఉన్న పేపర్‌పై నాన్న నన్ను వెతకొద్దు, బస్సు చార్జీలకోసం రూ.500 తీసుకున్నానని నన్ను క్షమించండని రాసిపెట్టి ఉందని సిఐ వెంకటేశులు వివరించారు. దీంతో సిఐ బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థి కోసం గాలింపు చేపట్టడంతో మునిశ్యాం విజయవాడలో ఉన్నాడని తెలియడంతో పోలీసులు విద్యార్థిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రభుత్వంపై ఐదు నెలల్లోనే ప్రజాగ్రహం

– ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయింపు

– సిఎం చంద్రబాబునాయుడుపై మాజీ డిప్యుటీ సిఎం నారాయణస్వామి ధ్వజం

పాలసముద్రం, నవంబర్ 17 ప్రభాతవార్త:

ఐదు నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజాగ్రహం ఏర్పడిందని మాజీ డిప్యుటీ సిఎం నారాయ ణ స్వామి ధ్వజమె త్తారు. పాలసముద్రం మండలం వెంగళరాజుకుప్పం సర్పంచ్ లిల్లీ ఆనంద్ గృహప్రవేశానికి ఆదివారం మండల వైకాపా అధ్యక్షులు తులసీ యాదవ్‌తో కలిసి హాజరైన మాజీ డిప్యుటీ సిఎం నారాయణస్వామి స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మేరకు హామీలు అమలు చేయాలని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న వారిపై సిఎం నారా చంద్రబాబునాయుడు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు.

సిఎం చంద్రబాబునాయుడుకు హామీలు ఇవ్వడమే తప్ప వాటిని అమలు చేసిన చరిత్ర ఎప్పుడు లేదని విమర్శించారు. అక్రమ కేసులు పెడితే భయపడే ప్రసక్తే లేదని, పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా కో-అర్డినేటర్లకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాలసముద్రం మండల వైకాపా అధ్యక్షులు తుల

తిరుపతి డివిజన్

కన్నులవిందుగా నృత్య ప్రదర్శన

తిరుచానూరు, నవంబర్ 17, ప్రభాత వార్త

తిరుచానూరు సమీపాన గల శిల్పారామంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన చూపరులకు కన్నుల విందు చేసింది. శిల్పారామం ఏఓ ఖాధర్ వలి సమాచారం మేరకు ప్రతి ఆదివారం కార్యక్రమంలో భాగంగా తిరుపతికి చెందిన కోటి వారిచే, నృత్య ప్రదర్శన, సంగీతం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందించారు.

ఆకాశ దీపాన్ని ఆవిష్కరించిన ఎఇఓ

శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త

ఆకాశదీపాన్ని ఆలయ ఆవరణలో ఆదివారం ఎఇఓ లోకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా కోట మండపం వద్ద ప్రతిరోజూ సాయంత్రం వేళ ప్రత్యేక స్థంభంపై ఆకాశదీపాన్ని ఆవిష్కరించటం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆలయ పౌరోహితులు అర్జగిరి స్వామి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తుండగా వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా శాస్త్రోక్తంగా స్థానిక సంప్రదాయ బద్ధంగా ఆవిష్కరింపజేసారు. ఈ కార్యక్రమాల్లో ఎఇఓ హేమ మాలిని సిబ్బంది పోటు ఇన్‌చార్జి సురేష్‌రెడ్డి, దామోదరం తదితరులుపాల్గొనగా లోకేష్‌రెడ్డి దీపాన్ని ఆవిష్కరించారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గత ఐదేళ్లు కుటుంబపాలనే

శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గత ఐదేళ్లు వైకాపా పాలనలో కుటుంబపాలన సాగిందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వివరించారు. ఆదివారం ఆయన ప్రభాత వార్తతో మాట్లాడుతూ గత ఐదేళ్ళు శివరాత్రిని తమ సొంత సంస్థానంలా మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వ్యవహరించారని ధ్వజమెత్తారు. శివరాత్రి పర్వదినాన ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని దర్శనం కోసం భక్తులు వస్తే తండ్రి ఓ పీఠాధిపతిలా, కుమార్తె మరో చోట ఇన్‌చార్జి, కుమారుడు ఇంకోక చోట తమ పలుకుబడితో శివరాత్రిని జరిపించారని ఆ విధానాలకు ఇక స్వస్తి అని సుధీర్‌రెడ్డి వివరించారు. రాబోవు శివరాత్రికి భక్తులు స్వామి అమ్మవార్లను మనసారా దర్శించుకొని తృప్తి పొందేందుకు అవసరమైన ఏర్పాట్లుపై అధికారులతో సమీక్షించామన్నారు. తాము పాలకులు అయినా తమ ప్రమేయం ఉండదన్నారు. అధికారులే భక్తుల మనోభావాలకు అనుగుణంగా శివరాత్రి జరపాలని ఆదేశించినట్లు ఎంఎల్‌ఏ మీడియా సమావేశంలో వివరించారు.

రాబోవు రోజుల్లో మైక్రో విధానాలు:

రాబోవు రోజుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయంలో మైక్రో విధానాలకు స్వాగతిస్తున్నట్లు వివరించారు. ఎక్కడా పైసలతో సంబంధం లేకుండా ఆద్యంతం డిజిటల్ విధానాలే ఉంటాయన్నారు. నగదు ఉంటే అవినీతి ఉంటుందని ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కాబట్టి రాబోయే రోజుల్లో విమానాశ్రయం, రైల్వేస్టేషన్, ఆర్‌టిసి బస్టాండులో దిగినప్పటి నుంచి మళ్ళీ తిరుగుపయనం వరకు అన్ని నగదు రహిత విధానాలే ఉంటాయని వివరించారు. అన్నిశాఖలను సమన్వయం పరుస్తూ, అనుసంధానం చేసి పరిపాలన సాగిస్తామన్నారు. ముస్సిపాలిటి, దేవస్థానం రెండు కళ్ళు అని, నిరుపేద అయిన ముస్సిపాలిటిని ఆదుకోవాల్సిన బాధ్యత దేవస్థానంపై ఉందని ఎంఎల్‌ఏ అభిప్రాయపడ్డారు.

పాలకమండలిలో అతిథులకు అవకాశం:

శ్రీకాళహస్తీశ్వరుని ఆదాయాలు రూ.200కోట్లు దాటుతున్నాయి. పాలకమండళ్ళలో బడా బాబులకు అవకాశం కల్పిస్తే ఆలయాన్ని ఆర్థికంగా ఇంకా ముందుకు తతీసుకెళ్ళవచ్చునన్నారు. శ్రీకాళహస్తీశ్వ రాలయానికి వచ్చిన ఏ భక్తుడు కూడా అతిథి గృహాలకు వెతుక్కొకుండా ఉండే అవకాశం కల్పించ వచ్చునని ఎంఎల్‌ఏ వివరించారు. ఈ నేపథ్యంలో తాను ప్రభుత్వానికి కూడా ప్రతిపాదిస్తున్నట్లు వివరించారు.

శివయ్య సేవలో ఎపి విప్

శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాష్ట్ర విప్ బొల్లిశెట్టి శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి వేదపండితులతో, వేద మంత్రాలతో స్వాగతం పలికారు. తాడేపల్లి గూడెం శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ కు స్వామి అంతరాలయంలో దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనానంతరం వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకఆశీర్వచనాలుఅందించారు. ఏర్పాట్లను టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు.

రామ్మూర్తినాయుడు మృతికి మాజీ ఎంఎల్‌ఏ నివాళులు

.శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త

మాజీ ఎంఎల్‌ఏ రామమూర్తి మృతికి మాజీ ఎంఎల్‌ఏ ఎస్సీ వీనాయుడు సంతాపం తెలిపారు. ముఖ్యమంత్రి సోదరుడు, చంద్రగిరి మాజీ ఎంఎల్‌ఏ రామ్మూర్తినాయుడు మృతదేహంకు మాజీ ఎంఎల్‌ఏ ఎస్సీ వీనాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర సిఎం నారాచంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ కుటుంబసభ్యులను ఆయన కలిశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తిరుపతి పార్లమెంటు తెలుగురైతు ఉపాధ్యక్షులు తక్కలపాటి ప్రకాష్‌నాయుడు, గోగినేని భాస్కర్‌నాయుడు, గోగినేని భాస్కర్‌నాయుడు, జానకిరామానాయుడు, ప్రభాకర్‌నాయుడు, గోగినేనిసురేష్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త

పట్టణంలోని బాబుఅగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు లార్డ్ బేడన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక పెండ్లి మండపం, బేరివారి మండపం, బిక్షాలగాలిగోపురం తదతర ప్రదేశాల్లో ట్రాఫిక్‌పై ప్రజల్లో ప్లకార్డులతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ పార్వతీ, స్కౌట్స్ తనాజ్, సాయికిరణ్, రాంసాయి, స్కౌట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడుగా రవి

శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త

వన్నెకుల క్షత్రియ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ బోర్డు సభ్యుడుగా నియమితులైన మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవి, బిజెపి పార్టీ రేణిగుంట మండల అధ్యక్షురాలు, విద్యావం తురాలు జీపాలెం తేజోవతిలకు సంయుక్తంగా సత్కరించారు. ఈసందర్భంగా కాపునాడు పెద్దలు జిల్లా గౌరవ అధ్యక్షులు పల్లమాల సుధాకర్ మరియు నియోజకవర్గం గౌరవ అధ్యక్షులు పగడాల సుధాకర్ సూచనలతో ఉమ్మడి సూచనలతో మిన్నల్‌రవి, తేజోవతిలను నియోజకవర్గంను పట్టణ కాపునాడు సభ్యులు తమతో కలసి మెలసి నడ్తూ తమకు దిశానిర్దేశం చేసే కమ్మరెడ్డిలు అమ్మపాశెం రమణారెడ్డిలు పాల్గొన్నారు. కాపునాడు జిల్లా అధ్యక్షుడు అరిగలవేణుగోపాల్(జనసేన నాయకులు), యువనాయకులు నియోజకవర్గ అధ్యక్షులు గరికపాటి చంద్రశేఖర్, పట్టణ కాపునాడు అధ్యక్షులు పగడాల ప్రతాప్, గుళ్ళూరు బ్రదర్స్, ఏర్పేడు బలి మండల నాయకులు మేఘవర్ణం, దామోదరరాయల్, కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు దెంపూరు భాస్కర్(రేణిగుంట వాస్తవ్యులు) వయ్యూవూరు మునికృష్ణ, బలిజ నాయకులు సన్మాన కార్యక్రమంలో పాల్గొని ఇద్దరిని సత్కరించి అభినందనలు తెలిపారు.

డిసెంబర్ 10న సిపిఎస్ ఉద్యోగులు ఛలో విజయవాడ

శ్రీకాళహస్తి, నవంబర్ 17 ప్రభాతవార్త

రాష్ట్ర కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపిసిపిఎస్ఈఏ) ఆధ్వర్యంలో డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు ఛలోవిజయవాడ కార్యక్రమం పోస్టర్లు రాష్ట్ర అదనపు కార్యదర్శి మరియు రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనాథ్‌ల ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు రేగంటిదేవానంద్, ప్రధాన కార్యదర్శి పివి.సుబ్బారెడ్డి, శ్రీకాళహస్తి కార్యవర్గ సభ్యులు కలసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ జిపిఎస్ మరియు సిపిఎస్‌ను రద్దుపరచి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులపై గత ప్రభుత్వం నమోదు చేసిన అన్ని కేసులను రద్దు చేస్తున్నామని శాసనసభలో విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ప్రకటించడంను స్వాగతిస్తున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు కూడా వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అదనపు కార్యదర్శిశ్రీనాథ్ మాట్లాడుతూ ఛలో విజయవాడ కార్యక్రమం యొక్క బాధను మరియు మా సమస్యలను తెలుపుటకు మాత్రమే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సాంప్రదాయంగా ప్రతి ఏడాది సెప్టెంబర్ 1 మరియు డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం రోజున టిపిఎస్‌ను రద్దు పరచి ఓపిఎస్‌ను అమలు చేయాలని తెలుపున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు ఏపిసిపిఎస్ఈఏ నాయకులు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడు మృతికి నివాళి

పుత్తూరు, నవంబరు 17 ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు రామ్మూర్తి నాయుడు మృతికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు నివాళులర్పించారు. స్థానిక ఎంబి రోడ్డులోని ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా రామ్మూర్తినాయుడు కాణిపాకం ఆలయ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. వ్యక్తిగతంగా తన రాజకీయ ఎదుగుదలకు ఆయన సహాయం చేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రవినాయుడు, ధనపాల్, కుమార్‌రెడ్డి, రవియాదవ్, ప్రకాష్, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని బలోపేతం చేయాలి

పుత్తూరు, నవంబరు 17 ప్రభాతవార్త :

పుత్తూరులో రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇ.శ్రీధర్ కోరారు. ఆది వారం పట్టణంలో జరిగిన సమా వేశంలో పార్టీ ఎన్నికల అధికారి కైలాసం మాట్లాడుతూ పార్టీకి సంబంధించి నూతనంగా మండల కమిటీ, శక్తి కేంద్రాలు, బూత్ కమిటీలు వేయాలని అధిష్టానం ఆదేశించిందని తెలిపారు. కార్యక్రమంలో25మంది మండల క్రియాశీల సభ్యులు, 14 మంది బూత్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

నా ప్రాణానికి రక్షణ లేదు

నన్ను నా భర్తను కలపండి

పూతలపట్టుకు చెందిన మోనిక ఆవేదన

తిరుపతి హెల్త్, నవంబర్ 17, ప్రభాతవార్త

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, పూతల దిపట్టు మండలం, పోలవరం గ్రామ పంచాయతీ, చింత మాకులపల్లి లో నివాసముంటున్న.. మా బంధువైన చరణ్ కుమార్‌ను ప్రేమించి వివాహం చేసుకున్నానని.. అప్పటినుండి నా భర్తకు చెందిన వారు తమను విడదీయాలని ప్రయత్నిస్తున్నారని పి. మోనిక ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్లో ఆదివారం ఆమె మాట్లాడుతూ.. తన భర్త, మామ, పెద్దమ్మలను అన్యాయంగా జైల్లో పెట్టి తనకు అబార్షన్ చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలియజేశారు. తాను ప్రాణ భయంతో తప్పించుకుని తిరుగుతున్నానన్నారు. పూతలపట్టు లోని పోలీసులు, రాజకీయ నాయకులు ఒక్కటై తన కుటుంబాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తన కుటుంబాన్ని రక్షించాలని అధికారులను వేడుకున్నారు.

ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతం

తిరుపతి హెల్త్, నవంబర్ 17, ప్రభాతవార్త

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) వారి ఆధ్వర్యం లో ఆదివారం రేణిగుంట జడ్‌పి గర్ల్స్ హైస్కూల్‌లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ తెలియ జేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తిరుపతి రోటరీ క్లబ్ వారి అభ్యర్థన మేరకు ఈ మెడికల్ క్యాంపును విజయవంతంగా నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ మెడికల్ క్యాంపు నిర్వహించడం ఎంతో సంతోషదయాకమని, ఈ యొక్క మెడికల్ క్యాంపు నందు అప్తమలజీ విభాగం వారు పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరం వున్నవారికి డా. యన్. టి. ఆర్. వైద్య సేవ ట్రస్ట్, టిటిడి ప్రాణదానం ట్రస్ట్ ద్వారా స్విమ్స్ వారు ఉచితంగా క్యాంపు నుండి స్విమ్స్‌కు తీసుకువెళ్లి సర్జరీ అనంతరం మళ్ళీ వారి స్థలం నందు వదిలివేసే సదుపాయం స్విమ్స్ వారు కల్పిస్తున్నారని దీనిని అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ క్యాంపులో మొత్తం 135 మందికి పరీక్షలు చేసి అందులో ముగ్గురిని స్విమ్స్‌కు రెఫెర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సోము రవికుమార్, సెక్రటరీ రాజేష్ కుమార్, రోటరియన్ కె.వి. చలపతి, ఇతర క్లబ్ మెంబర్స్, రేణిగుంట జడ్. పి. హై స్కూల్ హెడ్ మాస్టర్, విష్ణు వర్ధన, స్విమ్స్ వైద్య బృందాలు డా. వినీత, డా. శ్రీవిద్య, డా. హిందూజ, డా. మహేష్, డా. నిహాల్, డా. ప్రసన్న, డా. వర్ష, యంబిబియస్ ఇంటర్నీస్ ఎడి (పి. ఆర్) వి. రాజశేఖర్, పి. ఆర్. ఓ, యం.యస్.డబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ శిరిడిసాయి ఇంజనీరింగ్ అకాడమీలో టోటల్ స్టేషన్ పైన వర్క్ షాప్

తిరుపతి విద్య నవంబర్ 17,ప్రభాతవార్త:

శ్రీ శిరిడి సాయి ఇంజనీరింగ్ అకాడమీ తిరుపతిలో టోటల్ స్టేషన్ వర్క్ షాప్ నిర్వహించారు. ఇందులో భాగంగా టోటల్ స్టేషన్ పైన ఉన్న జాబ్ అవకాశాలు గురించి ఇన్స్ట్రక్షన్ డైరెక్టర్ ఈ నరసింహులు స్పష్టంగా వివరించారు. సర్టిఫికేషన్ కోర్సెస్ ఇన్ టోటల్ స్టేషన్ ఆటో సిఎడి ఫర్ డిప్లమా స్టూడెంట్స్ కి ప్రొవైడ్ చేస్తున్నాము. విత్ రీజనబల్ కాస్ట్ గెస్ట్ రవిచంద్ర టోటల్ స్టేషన్ ఎక్స్పోర్ట్ మాట్లాడుతూ టోటల్ స్టేషన్ పైన జాబ్ అవర్చునిటీస్ గురించి వివరించారు. సర్టిఫికేషన్ కోర్సెస్ వన్ మంత్,త్రీ మంత్స్,సిక్స్ మంత్స్ ప్రొవైడ్ చేస్తున్నాము అని, కోర్సెస్ కంప్లీట్ అయిన తర్వాత సర్టిఫికెట్ తో పాటు 100 శాతం ప్లేస్మెంట్స్ ఇస్తాము అని అన్నారు.

రూరల్ సిపిఎం కార్యదర్శిగా కె.సుమన్

తిరుచానూరు, నవంబర్ 17, ప్రభాతవార్త

తిరుపతి గ్రామీణ మండలం సిపిఎం కార్యదర్శిగా కె.సుమన్ ను ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన తిరుపతి రూరల్ మహాసభ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా రూరల్ కమిటి సభ్యులుగా జి.చిన్న, బాబు, ప్రకాష్, బాలాజీ, భాను, శ్రీనివాసులు, కృష్ణ, భాస్కర్, రాజశేఖర్, పౌర్ణమి తదిరులను ఎన్నుకున్నారు. అనంతరం తిరుపతి రూరల్ కార్యదర్శి సుమన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ జయ చంద్ర మాట్లాడుతూ తిరుపతి రూరల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందింది అన్నారు. రూరల్ ప్రాంతంలో ప్రభుత్వ భూములు అన్ని కూడా కబ్జా గురవుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు అని తెలిపారు. కబ్జా గురైన ప్రభుత్వ చెరువులు కాపాడాలని సిపిఎం డిమాండ్ చేస్తుందని, అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

రాజకీయ గురువుకు పులివర్తి నాని అశ్రునివాళి

చంద్రగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త:

రాజకీయంగా తనకు పటిష్టమైన పునాదులు నిర్మించి ముందడుగులు నేర్పిన రాజకీయ గురువు, మాజీ ఎంఎల్‌ఏ నారా రామ్మూర్తి నాయుడుకు ఎంఎల్‌ఏ పులివర్తి నాని తనవంతు అంతిమ కార్యక్రమాలను నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచిన తన గురువు దహన క్రియలకు అవసరమైన ఏర్పాట్లను చేయడంలో తలమునకలయ్యారు. ఆదివారం రామ్మూర్తి నాయుడు పార్థివదేహం రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకోవడంతో ఎంఎల్‌ఏ స్వయంగా అక్కడి నుండి అంబులెన్స్ ద్వారా నారావారిపల్లికి తీసుకువచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు అవసరమైన ఏర్పాట్లను చేశారు. అంతిమ యాత్రలో వారితో కలసి పుట్టెడు దుఃఖాన్ని పంటిబిగువున దాచుకుని పాడెనుమోసి రుణం తీర్చుకున్నారు. తండ్రితో కలసి పులివర్తి వినీల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాతీయ రహదారిని కమ్మేస్తున్న ముళ్లకంపలు

నారాయణవనం, నవంబర్ 17 ప్రభాతవార్త :

పుత్తూరు-చెన్నై జాతీయ రహదారికి ఇరువైపులా మొలచిన మొక్కలు రోడ్డును కప్పేయడంతో వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అలాగే పుత్తూరు నుంచి సత్యవేడు వరకు నేషనల్ హైవే అధికారులు రోడ్డుకు ఇరువైపుల మొలచిన మొక్కలను తొలగించడం లేదు. దీంతో ఈ ముళ్ల కంపలు రోడ్డుకు ఇరువైపుల కప్పేయడంతో వాహనచోదకుల అవస్థలు వర్ణనాతీతం. పుత్తూరు నుంచి సత్యవేడు వరకు సుమారు 65 కిలోమీటర్ల దూరం వుంది. సుమారు 19ఏళ్ల క్రితం ఈ రోడ్డును జాతీయ రహదారిగా మార్చారు. ఈ మార్గంలో ప్రతిరోజు వేలసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నేషనల్, అర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నది.

నారా లోకేష్‌ను కలసిన అధికారులు, ప్రతినిధులు

రేణిగుంట, నవంబరు 17 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తమ చిన్నాన్న నారా రామూర్తినాయుడు అంత్యక్రియలో పాల్గొనడానికి ఆదివారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి లోకేష్ బాబాయ్ నారా రామూర్తి నాయుడు మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. రామూర్తి నాయుడు మృతదేహం రేణిగుంట విమానాశ్రయం చేరుకునే వరకు అక్కడే ఉండి మంత్రి నారా లోకేష్ తమ కుటుంబ సభ్యులతో కలసి రోడ్డు మార్గంలో నారావారిపల్లె బయలుదేరి వెళ్లారు.

అభివృద్ధి మార్గదర్శిని కోల్పోయాం - టీడీపీ కో-ఆర్డినేటర్

సత్యవేడు, నవంబరు 17 ప్రభాతవార్త:

చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామూర్తినాయుడు అభివృద్ధి మార్గదర్శిగా నిలిచిపోయారని సత్యవేడు టీడీపీ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు తన సంతాప ప్రకటనలో ఆదివారం తెలియజేశారు. చంద్రగిరితో పాటు సత్యప్రమానాల దేవుడిగా ఉన్న కాణిపాకం అభివృద్ధి నేడు భక్తజనులకు ఎంతో ఉపయోగపడుతోందని ఆయన తెలిపారు. క్రమశిక్షణ, నమ్ముకున్న వారికి న్యాయం చేయడం, పేదలఅభివృద్ధిరామూర్తినాయుడుకుఎంతోప్రీతిపాత్రంగామిగిలిందని శ్రీపతిబాబు తెలియజేశారు. నారావారిపల్లెలో జరిగిన రామూర్తినాయుడు అంత్యక్రియల్లో ఆయన పాల్గొని నివాళుల ర్పించారు.

సభ్యత్వ నమోదు జోరు పెంచండి

సత్యవేడు, నవంబరు 17 ప్రభాతవార్త:

సత్యవేడు నియోజకవర్గం సత్యవేడు మండలంలో ఆర్‌వో నరేంద్రరెడ్డి మండల అధ్యక్షులు మునిప్రతాప్ ఆధ్వర్యంలో ఆదివారం సంస్థాగత ఎన్నికల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భం గా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన సభ్యత్వ నమోదు, క్రియాశీలక సభ్యత్వానికి అర్హత సాధించిన వారి వివరాలు తెలుసుకోవడం, బూత్ కమిటీ ఏర్పాటు గురించి సూచనలు చేశారు. ఇప్పటి వరకు సభ్యత్వం నమోదు కాని బూత్‌లను గుర్తించి అక్కడ కూడా సభ్యత్వం జరిగేలా చొరవ చూపాలని తెలియజేయడం జరిగింది. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, ప్రధాన కార్య దర్శి వాసు, నాయకులు వెంకటేశులు, శేఖర్, కోటేశ్వరరావు, కుమార్, సుందరం, బాలరాజ్, చిరంజీవి పాల్గొన్నారు.

నారా రామూర్తినాయుడుకి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళి

నారాయణవనం, నవంబర్ 17 ప్రభాతవార్త :

రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామూర్తినాయుడు శనివారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విధితమే. ఆదివారం చంద్రగిరి మండలం వారి స్వగ్రామం నారావారిపల్లెకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయనతోపాటుసత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - ఎమ్మెల్యే

వడమాలపేట, నవంబరు 17 ప్రభాతవార్త:

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. ఆదివారం ఉదయం వడ మాలపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రైతులకు ప్రభుత్వ సబ్సిడీ వేరుశనగ విత్తనాలను ఎమ్మెల్యే రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవడానికి అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. ఏవో విజయకుమార్ మాట్లాడుతూ సోమవారం నుంచి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రబీ సీజన్‌కు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. వేరుశనగ 30 కేజీల బస్తా విత్తనశుద్ధి మందుతో పాటు 1800 రూపాయలకు రైతులకు అందజేస్తామన్నారు. అలాగే ఉద్దులు(మినుములు) నాలుగు కేజీల బ్యాగు 392 రూపాయలకు, నువ్వులు 2 కేజీలు సబ్సిడీ పోను 202 రూపాయలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తక

గూడూరు డివిజన్

దివ్యాంగులకు కూరగాయలు గుడ్లు పంపిణీ

గూడూరు, నవంబర్ 17 ప్రభాతవార్త : గూడూరు స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సంఘం డైరీ మాధవ రెడ్డి దాతృత్వంలో దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేసారు. జే.వి.వి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన నా స్నేహితుడు మాధవరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. జే.వి.వి గత 15 నెలలుగా విభిన్న ప్రతిభావంతులైనటువంటి వారందరికీ ప్రతి నెల మూడవ ఆదివారం కూరగాయలు గుడ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జే.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, గుర్రం విజయ్ బాబు, సుమన్ రెడ్డి, ఇబ్రహీం, జానా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు : సిఐ

నాయుడుపేట టౌన్, నవంబరు 17 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణం-మండలంలో ఎవరైన మద్యంసేవించి వాహనాలను డ్రైవింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట సిఐ బాబి తెలియజేశారు. ఆయన ఆదివారం నాయుడుపేట పట్టణంలో మద్యం సేవించి వాహనాలు డ్రైవింగ్ చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదుచేశారు. సిఐ బాబి మాట్లడుతూ నాయుడుపేట మండలంలో ఎవరైన రాష్ డ్రైవింగ్ చేసిన,శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. నాయుడుపేట పట్టణంలో చోరీలు నివారించేందుకు రాత్రిసమయంలో భద్రత పెంచి తనిఖీలు చేపట్టడం ద్వారా చోరీలను నియంత్రిచవచ్చునని ఆయన తెలిపారు.

వైసిపి పార్టీ కార్యకర్తలు అండగా ఉంటా : నేదురుమల్లి

వెంకటగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త : వైసీపీ పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటానని నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా పోస్టులపై అరెస్ట్ చెయ్యడానికి పోలీసులు వచ్చినప్పుడు కార్యాచరణ పాటించాలని తెలిపారు. ముందుగా మిమ్మల్ని అరెస్టు చెయ్యడానికి వచ్చిన వారు పోలీసులు కాదా అని నిర్ధారించుకోవాలని సూచించారు. ఏ కారణం చేత మిమ్మల్ని అరెస్టు చెయ్యడానికి వచ్చారో మీ కుటుంబ సభ్యులు లేదా మీ తోటి మిత్రులు ద్వారా వారిని అడిగి తెలుసు కోవాలని చెప్పారు. మీకు నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేస్తుంటే నోటీసులు ఇవ్వమని అడగాలని తెలిపారు. పార్టీ కార్యాలయంలో తెలియజేడనికి ఈ సెల్ నెంబర్‌కు 72077 92960 ఫోన్ చేయాలని సూచించారు. మరల వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అందరూ ధైర్యంగా ఉండాలని కోరారు.

గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యం

వెంకటగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త : వెంకటగిరి మండలంలోని గిరిజనలకు గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా శ్రీనివాసన్ సర్వీసెస్ ట్రస్ట్ పనిచేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ విశ్రాంత ఐఏఎస్ అధికారి అయిన స్వరణ్ సింగ్ తెలిపారు. గుండ్ల సముద్రం గిరిజన కాలనీకి ట్రస్ట్ సహాయంతో గృహాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గిరిజన కాలనీకి రోడ్డు వసతి కూడా కల్పించినట్లు తెలిపారు. అంగన్వాడి భవనాలను అభి వృద్ధి చేసినట్లు చెప్పారు. పేదల జీవనోపాధి కోసం కోళ్ల పెంపకం కోసం ప్రోత్సహించినట్లు చెప్పారు. వెంకటగిరి పట్టణం గ్రామాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఎస్ ఎస్ టి సంస్థ పనిచేస్తున్నట్లు తెలిపారు.

26వ తేదీ కలెక్టరేట్ వద్ద ధర్నా :సీఐటీయు

వెంకటగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26వ తేదీ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెంగయ్య తెలిపారు. సిఐటియు ఆఫీస్ వద్ద కర పత్రం విడుదల చేయడం జరిగింది. కార్మిక సంఘాలు, రైతు సంఘాలు ఆధ్వర్యంలో నవంబర్ 26వ తేదీ తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు నాయకులు కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు పిలుపుమేరకు నవంబర్ 26వ తేదీన దేశవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు జరుగుతున్నాయని అన్నారు. వెంకటగిరి నియోజకవర్గ పరిధి జిల్లా పరిధిలో ఉన్నటువంటి కార్మికులు, రైతులు అందరూ కూడా కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు వెంకటగిరి ప్రాజెక్ట్ లీడర్స్ నిర్మల, రమణమ్మ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు వెంకటగిరి పట్టణ అధ్యక్షులు ,సుబ్బయ్య, ఉపాధ్యక్షులు పి సుబ్రహ్మణ్యం, సిఐటియు నాయకులు ఎం వి రమణ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తదితరులు పాల్గొనడం జరిగింది.

వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి అంబలం పూజ

చిల్లకూరు, నవంబర్ 17 ప్రభాతవార్త : చిల్లకూరు మండలం కడివేడు గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి పెనుబోలు సునీల్ రెడ్డి.కుటుంబ సభ్యులు శ్రీ అయ్యప్ప స్వామి అంబలం పూజ వైభవంగా నిర్వహించారు. గురుస్వామి రమణయ్య, మల్లికార్జున స్వామి, ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలలు వేసిన భక్తులు వందలాదిగా తరలివచ్చి, భజనలు చేసి, అయ్యప్పను దర్శించుకుని, బిక్ష స్వీకరించారు.

సముద్ర తీరంలో భక్తుల సందడి

కోట, నవంబర్ 17 ప్రభాతవార్త : కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని పెదగోవిందుపల్లి సముద్ర తీరం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తీరానికి విచ్చేసి కార్తీక మాస పుణ్యస్నానాలు చేశారు. ఉదయం 5 గంటల నుంచి తీరం వెంబడి దీపాలు వెలిగించి స్నానాలు ఆచరించారు. ఈ క్రమంలోనే గూడలి గ్రామం వద్ద స్వర్ణముఖి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. పక్కనే ఉన్న సంగమేశ్వరస్వామి, జనార్దనస్వామి, భీమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

సర్వే తప్పులు దిద్దుబాటు

కోట, నవంబర్ 17 ప్రభాతవార్త : సర్వే కారణంగా తప్పిదాలు వెల్లువలా ఫిర్యాదులు వస్తున్నాయి. సర్వే కారణంగా జరిగిన తప్పిదాలను సరి చేయాలని గ్రామసభల్లో రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూసర్వే రైతుల మధ్య పంచాయితీలు తెచ్చిపెట్టింది. సర్వే నంబర్లు మాయమయ్యాయి. విస్తీర్ణంలో కోతపెట్టారు, కాళ్ల కింద భూమి కదిలిపోవడంతో కంగారుపడిన రైతులు రెవెన్యూ అధికారులు చుట్టూ ప్రదక్షణలు చేసినా ప్రయోజనం లేకపోయింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కారానికి శ్రీకారంచుట్టింది. సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని చెప్పడంతో కోట మండలంలోని ఐదు గ్రామాల్లో తహశీల్దార్ జయజయరావు గ్రామసభలు నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ విషయంపై తహశీల్దార్ జయజయరావును 'ప్రభాతవార్త' వివరణ కోరగా, రెవెన్యూ, సర్వే అధికారులు రైతులకు క్షేతస్థాయికి వెళ్లి న్యాయం చేస్తారని తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి రైతుల సమస్యలను తెలిపామన్నారు.

సూళ్లూరుపేటలో ట్రాఫిక్ కష్టాలు

సూళ్లూరుపేట, నవంబర్ 17 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలో రోజురోజుకి ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోతున్నాయి. ప్రజలు రోడ్లపై నడవాలంటే భయపడిపోతున్నారు. ముఖ్యంగా బాపూజీవీధి, కచ్చేరివీధి ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ రద్దీతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లాలంటే కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బజారు సెంటర్లో ఇటీవలే నూతనంగా రోడ్లను విస్తరించి 30 అడుగుల మేర రోడ్లు వేశారు. సిమెంటు రోడ్డు వేశారే గాని దానిపై ట్రాఫిక్ నియంత్రణ మరిచారు. 15 అడుగుల రోడ్డు ఉన్నప్పుడు ఉన్న ట్రాఫిక్ కన్నా ఎక్కువగా ప్రస్తుతం రోడ్డుపై ఆక్రమణలు పెరిగిపోయాయి. వ్యాపారులు, తోపుడు బండ్లు, బుట్టల్లో అమ్ముకునే వారు తమ వ్యాపార సౌలభ్యం కోసం ఎక్కడపడితే అక్కడ పెట్టుకొని దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. మరోవైపు దుకాణాలకు వచ్చే వ్యాపారుల మోటార్‌బైక్‌లు, ఆటోలు, కార్లు వంటి వాహనాలను రోడ్లపై అడ్డంగా పెట్టడంతో వాటిని నియంత్రించలేక ప్రజలు నడిచే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఎవరైనా ఈ విషయాన్ని ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. పోలీసులు తూతుమంత్రంగా ట్రాఫిక్ చేస్తున్నారే గాని ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు. పాత సిండికేట్ బ్యాంక్ సెంటర్, రైల్వేగేటు సెంటర్, హాస్పిటల్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ రద్దీతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మరోవైపు మున్సిపాలిటీ వారి నిర్వహణలో ఉండే రోడ్లలో కూడా ఆక్రమణలను అడ్డుకోకపోవడంతో 'రోడ్డు మనదే వేసేయ్ పాగా' అంటూ ఎవరికి తోచిన విధంగా వారు రోడ్డుపై ఆక్రమించు కుంటున్నారు. ఇప్పటికైనా పోలీసులుతో పాటు మున్సిపల్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ట్రాఫిక్ నియంత్రించకపోతే భవిష్యత్‌లో పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు మరింత ఎక్కువయ్యే అవకాశాలు ఉన్నాయి.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

తడ, నవంబర్ 17 ప్రభాతవార్త : సూళ్లూరుపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కాదలూరు గ్రామంలో జరిగిన ఎక్సైజ్‌శాఖ దాడుల్లో అంబూరి నవీన్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుం డటంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బెల్టుషాపుల నిర్వాహకులపై దాడులు చేశారు. నవీన్ నుంచి 32 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. సూళ్లూరుపేట పట్టణంలోని ఓ మద్యం దుకాణం నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వీటి విలువ రూ.3,520 ఉంటుందని తెలిపారు. నవీన్‌ను అరెస్టు చేసి అతనిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ సిఐ సురేంద్ర బాబు మాట్లాడుతూ మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ సురేష్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ప్రేమ్‌కుమార్, కానిస్టేబుళ్లు సురేష్, మోహన్‌రావు పాల్గొన్నారు.

రామూర్తినాయుడుకు నివాళులర్పించిన నెలవల

నాయుడుపేట టౌన్, నవంబరు 17 ప్రభాతవార్త; ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు మాజీ ఎమ్మెల్యే నారా రామూర్తినాయుడుకు సూళ్ళూరుపేట నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం ఆదివారం నివాళర్పించారు. నారా రామూర్తి నాయుడు గతకొంత కాలంనుండి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం హైదరాబాద్‌లోని ప్రవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో నాయుడుపేటలోని తెదేపా కార్యాలయంలో నెలవల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీనాయకులు నారా రామూర్తినాయుడు చిత్రపటానికి పూల మాలలువేసి ఘనంగా నివార్పించారు. మాజీఎంపి నెలవల సుబ్రమణ్యం మాట్లడుతూ రామూర్తి నాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ఆకాక్షించారు. ఆయన వెంట నివాళర్పించినవారిలో తిరుమారు సుదాకర్‌రెడ్డి,మైలారి రాజశేఖర్,సుబాబ్బరావు,గొను జకరయ్య,తదితరులు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

108 కలిశాల జలాలతో అయ్యప్ప స్వామికి అభిషేకం

వెంకటగిరి, నవంబర్ 17 ప్రభాతవార్త : పట్టణంలోని కుమ్మరకుంట వద్ద వెలసి ఉన్న అయ్యప్ప స్వామికి 108 కలిశాల జలాలతో అభిషేకం నిర్వహించారు. పుణ్య నదుల నుండి తెచ్చిన జలాలతో అభిషేకాలు చేశారు. పుణ్య నదుల నుండి తెచ్చెన జలాలతో అభిషేకం జరిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలిశాలను ముందుగా గుడి వద్ద ఊరేగించారు. మాలాధారంలో ఉన్న అయ్యప్ప భక్తులు భజనలు నిర్వహించారు. ఘనంగా అయ్యప్ప స్వామికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి!

వాకాడు, నవంబర్ 17 ప్రభాతవార్త : అనుమానస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడని గ్రామస్తులు ఆదివారం పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వివరాల మేరకు వాకాడు మండలం దుగ్గరాజపట్నం నుండి మల్లం వెళ్లే రోడ్డు ప్రక్కన తాటిచెట్టు పొదల్లో అనుమానస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి పట్ల ఆరా తీస్తున్నామన్నారు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. హత్య, ఆత్మహత్య అనేది తెలియాల్సి ఉంది.

భక్తుల రద్దీతో కిక్కిరిసిన కాణిపాకం

-దర్శనానికి నాలుగు గంటల సమయం

కాణిపాకం, నవంబర్ 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం ఆదివారం భక్తుల రద్దీతో కిక్కిరిసింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రంల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు కూడా క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల సమయం వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

విచ్చలవిడిగా నాటుసారా!

పాలసముద్రం, నవంబర్ 17 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో నాటుసారా విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. నాటు సారా విక్రయదారులు సారా విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పాలసముద్రం మండలం తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దులో వుండటంతో ఇక్కడి నుండి అనునిత్యం ఇసుక అక్రమ రవాణాతో పాటు నాటు సారా తయారీ జోరుగా సాగుతుంది. ఇక్కడ విధులు నిర్వర్తించే ఎస్ఐని ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసి కొత్త ఎస్ఐగా ఎవరిని నియమించకపోవడంతో మండలంలో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణాతో పాటు నాటు సారా తయారు చేసి యదేచ్ఛగా విక్రయాలు జరిపి లాభాలు ఆర్జిస్తున్నారు. మండల పరిధిలో నాటు సారా తయారీ మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుండగా అధికారులు మాత్రం తనిఖీలు నిర్వహించి నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న వారిపై నామమాత్రపు కేసులు బనాయించి విడిచిపెడ్తుండటంతో ఈ వ్యాపారం మండలంలో మరింత విస్తరిస్తోంది. నాటు సారా విక్రయాలు చేస్తూ పట్టుబడి జైలుకు వెళ్ళిన వారు మళ్ళీ తిరిగి వచ్చి తన నాటు సారా తయారీ కార్యక్రమంను చేపట్టి విక్రయాలు చేస్తుండటంతో ఈ వ్యాపారం చేసే వారి సంఖ్య మండలంలో ఎక్కువ అవుతుంది. నాటు సారా సేవించిన వ్యక్తులు ప్రజల మధ్యలోకి వచ్చి గలాభా సృష్టిస్తుండటం, అధికారుల నుండి ఏ మాత్రం స్పందన లేకపోవడంతో ప్రజలకు ఏమి చేయాలనేది పాలుపోని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పోలీసు, ఎక్సైజ్ అధికారులు మండల పరిధిలో నాటు సారా తయారీ కట్టడికి పక్కా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

శ్రీవారిదర్శనంతో మనసు సంతోషం

తిరుమల,నవంబర్ 17 ప్రభాతవార్తప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుంటే మనసు ఎంతో హాయిగా ఉంటుందని ఎమ్మెల్యేలు, ఎంఎల్సి తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, జిడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్, ఎంఎల్సి భరత్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శనం చేసుకున్నారు.

జల్సాలకు అలవాటుపడి వరుస చైన్‌స్నాచింగ్‌లు

-నిందితుడి అరెస్టు...బంగారం స్వాధీనం

పుంగనూరు రూరల్,నవంబరు 17 ప్రభాతవార్త : ఉద్యోగం చేయాల్సిన వయసులో వ్యసనాలకు అలవాటుపడి చైన్‌స్నాచింగ్‌లు చేసి మరీ జల్సాలు చేస్తున్న యువకుడిని పుంగనూరు పోలీసుల అదుపులో తీసుకుని బంగారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని లక్ష్మీనాయక్ తాండాకు చెందిన బుక్యా బాలాజీనాయక్ కుమారుడు బుక్యా ప్రసాద్‌నాయక్ ఉద్యోగం చేయకుండా జులాయిగా తిరగడానికి అలవాటుపడ్డారు. ఈనేపథ్యంలో తండ్రి ద్విచక్రవాహనాన్ని తీసుకుని నెంబర్‌ప్లేట్ తొలగించి పుంగనూరు పట్టణం, మండల పరిధిలో వరుసగా చైన్‌స్నాచింగ్‌లకు అలవాటుపడ్డాడు. శనివారం రాత్రి ఒక మహిళ మెడలో చైన్‌స్నాచింగ్ చేసి పారిపోతుండగా జనం అతడిని వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సిఐ శ్రీనివాసులు అధ్వర్యంలో ఈతడిని విచారింగా మండల,పట్టణ పరిధిలో మూడు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డాడని తెలిసింది. ఇతని వద్దనుంచి ఆరులక్షల యాభైవేల రూపాయలు, 69గ్రాముల బంగారు ఒక ద్విచక్రవాహనం స్వాధీనంచేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌నకు తరలించారు.

వైభవంగా శివపార్వతుల ఊరేగింపు

వడమాలపేట, నవంబరు 17 ప్రభాతవార్త: వడమాలపేట భవానీశంకర దేవాలయంలో నిర్వహిస్తున్న 11వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పురవీధుల్లో శివపార్వతుల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. ఉదయం గోపూజ, గణపతిపూజ, స్వస్తి వాచన, ఏకాదశి రుద్ర కలశస్థాపన, మహాశివుడి పంచామృత అభిషేకం నిర్వహించారు. అర్చకులు శివ, సాయిలు వేదమంత్రాలు, మంత్ర పుష్పాలతో 108 కలశాల స్థాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పట్టు పీతాంబరాలు, సర్వభరణాలు, పూలమాలలతో అలంకరింపచేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగుతున్న శివపార్వతులు భక్తులను కటాక్షించారు. రాత్రి మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేదోక్తంగా ఉత్సవమూర్తులకు స్నపనం

తిరుమల,నవంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి: కార్తీక మాసంలో కార్తీకవనభోజనం ఆదివారం ఉదయం వైభవోత్సవ మండపంలో చేపట్టారు. ఉదయం శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవ మూర్తు లకు విశేష స్నపనతిరుమంజనం నిర్వహించి, ధూపదీపకర్పూర నివేదనలు, ప్రసాదం సమర్పించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

వేడుకగా తోటవారి... కార్తీకమాస దామోదరవ్రతం



తిరుపతి,నవంబర్ 17ప్రభాతవార్త: కార్తీక మాసంలో ఆదివారం రోజు తోట కుటుంబాలు సామూహిక కార్తీకమాస దామోదర వ్రతపూజా కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నాయి. ఈ కుటుంబాల్లోని సభ్యులు అందరూ కలసి తిరుపతిలోని దివ్యారామంలో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు అర్చకస్వాములతో వైదిక కార్యక్రమాలు జరిపించారు. తులసీ,ఉసిరి మొక్కలకు నూతన వస్త్రాలు అలంకరించి దామోదరవ్రతం, సుమంగళిపూజ నిర్వహించారు. అనంతరం తోట కుబుంబాలు వనభోజన మహోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమాంలో తోటబాలాజీ, తోట అమర్‌నాథ్, పలువురు పాల్గొన్నారు.

ప్రత్యేక విమానంలో వచ్చిన సిఎం

రేణిగుంట, నవంబరు 17 ప్రభాతవార్త: రాష్ట్రముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు తమ్ముడు నారా రామూర్తి నాయుడు అంత్యక్రియలో పాల్గొనడానికి ప్రత్యేక విమానంలో రేణిగుంటకు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీచైర్మన్ బి.ఆర్.నాయుడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, టీడీపీ జిల్లా నాయకులు నరసింహ యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి తదితరులు కలిశారు. మహా రాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ విమానాశ్రయంలో చంద్రబాబునికలసి ఆయన తమ్ముడు రామూర్తినాయుడు ఆకస్మిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి తమసంతాపాన్ని ప్రకటించారు. అనంతరం చంద్రబాబు రోడ్డు మార్గంలో చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లెకు బయలుదేరి వెళ్లారు.

ఆలయ ప్రవేశ టిక్కెట్లు తప్పని సరిగా కొనాల్సిందే : ఇఓ

శ్రీకాళహస్తి,నవంబర్ 17 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే అతిథులు,భక్తులు దేవుని దర్శనానికి టిక్కెట్టు కొనటానికి ఎందుకు ఆలోచిస్తారని ఆలయ కార్యనిర్వహాణాధికారి టి.బాపిరెడ్డి అన్నారు. ఆదివారం ఆలయంలో వివిధ అంశాలకు సంబంధించి పర్యవేక్షిస్తు, తనిఖీలు చేస్తూ కొత్తగా ఏర్పాటు చేసిన విఐపిల టిక్కెట్టు కొనుగోలు కౌంటర్‌ను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో భక్తిభావం కల్పించుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఆలయంలోనికి దక్షిణ గోపురం దాటి ఎవ్వరూ సెల్ ఫోన్లు తీసుకెళ్ళకుండా కట్టడి చేసామన్నారు. ఈ నేపథ్యంలో ఆలయంలో పని చేసే ఉద్యోగుల సెల్‌ఫోన్లను సిఆర్ఓ కార్యాలయంలో డిపాజిట్ చేయటానికి కౌంటర్ పెట్టామన్నారు. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే ప్రోటోకాల్ అతిథులకు వారికి ఇవ్వాల్సిన ప్రాధన్యత దర్శనంలో ఇస్తామని అయితే వారితో వచ్చే వారు దర్శనానికి ప్రవేశ టిక్కెట్లు తప్పని సరిగా కొనాల్సిందే అని వివరించారు. తిరుమలేశుని సన్నిధికి వెళ్ళినపుడు ప్రతి ఒక్కరు ఎంత పెద్ద అతిథి అయినా టిక్కెట్లు కొంటున్నారు కదా ! ఇక్కడ కూడా కొనటానికి ఎవ్వరూ సంకోచించరని ఇఓ బాపిరెడ్డి అభిప్రాయపడ్డారు. కొన్ని సంస్కరణలు ఒక్కసారిగా అమలు జరపలేమని దశల వరిగా అమలు చేయనున్నట్లు వివరించారు. మీడియా వారికి ఇచ్చే